

ప్రజా

# రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

ఎడిటర్; నాగేంద్ర సంపుటి : 01 I సంచిక : 242 I హైదరాబాద్ 7-12 - 2024 పేజీలు : 4 I వెల రూ.6/-




## డీప్ టెక్ కాన్ఫరెన్స్‌లో ఏడు అవగాహన ఒప్పందాలు..

విశాఖపట్నం, : విశాఖపట్నం వేదికగా శుక్రవారం జరిగిన డీప్ టెక్ సదస్సులో జిఎఫ్ఎస్‌టి (గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్)కి వివిధ కంపెనీలకు మధ్య ఏడు ఒప్పందాలు జరిగాయి.

విద్య, వైద్య రంగాల్లో టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ స్టడీస్, మహిళా సాధికారత తదితర అంశాలపై జిఎఫ్ఎస్‌టితో సమగ్ర, జీఎస్సార్, ఫ్లూయింట్ గ్రిడ్ లిమిటెడ్, జర్మన్ వర్శిటీ ఒప్పందాలు చేసుకోగా, గేమ్ కంపెనీ రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

అలాగే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సీఎంఎస్ కంపెనీతో ప్రత్యేక ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆయా కంపెనీల ప్రతినిధులు ఎంఓయూలకు సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. వివరాలు 2లో



2లో

## టీడీపీ శాశ్వత సభ్యత్వం




# నాలెడ్జ్ ఎకానమీకి విశాఖ ఫ్యూచర్ సిటీ : సీఎం చంద్రబాబు

నాలెడ్జ్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీగా విశాఖపట్నం మారుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఉత్తమ నగరాలలో ఒకటిగా విశాఖ నిలుస్తుందన్నారు. టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, నాలెడ్జ్ ఎకానమీలో యువత కీలకంగా మారారని అన్నారు. విశాఖపట్నంలో నేషనల్ డీప్ టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌కు శుక్రవారం హాజరయ్యారు. డీప్ టెక్నాలజీ సదస్సు-2024 లో స్వర్ణ ఆంధ్ర ట్రాన్స్ఫ్మేషన్ ఇండియా టూ వికసిత భారత్ , ఏఐ ఫర్ ఎవరీ వన్ అనే రెండు పుస్తకాలు ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. వివరాలు 2లో



# చేతులు పట్టుకుని.. చలోక్తి విసిరి..

-పార్లమెంటు ఆవరణలో మోదీ, ఖర్గే సరదా ముచ్చట

న్యూఢిల్లీ, డిసెంబరు 6: సభలో ఎన్ని వాగ్యుద్ధాలు చేసుకున్నా.. వేరే సందర్భాల్లో కలుసుకున్నప్పుడు రాజకీయ నాయకులు సరదాగా ముచ్చట్లు చెప్పుకోవడం సహజమే! శుక్రవారం పార్లమెంటు ప్రాంగణంలో అలాంటి దృశ్యమే కనిపించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పార్లమెంటు ఆవరణలో సర్కారు 'మహా పరినిర్వాణ్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించింది. రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు.. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కాగా, ఆ సమయంలో ఖర్గే ప్రధాని మోదీ వద్దకు వెళ్లి ఆయనతో కరచాలనం చేశారు. ఖర్గే ఏం చలోక్తి విసిరారో ఏమోగానీ.. మోదీ పెద్దగా నవ్వారు. వారిద్దరూ అలా చేతులు పట్టుకుని, కాసేపు నవ్వుతూ మాట్లాడుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



## రైతన్నలకు శుభవార్త
## ఎటువంటి హామీ లేకుండానే రెండు లక్షలు రుణం

న్యూ ఢిల్లీ : రైతులకు ఆర్ బి ఐ శుభవార్త చెప్పింది..ఇకపై రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించింది రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా. చిన్న, సన్నకారు రైతులకు పెద్ద ఉపశమనం ఇచ్చేలా భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం కీలక ప్రకటన చేసింది. చిన్న, సన్నకారు రైతులకు ఎలాంటి పూచీకత్తు లేకుండానే ఇచ్చేలా రుణాల పరిమితిని రూ. 1.60 లక్షల ంచి రూ. 2 లక్షలకు పెంచింది భారతీయ రిజర్వ్ బ్యాంక్. వివరాలు 2లో



## పోలవరం గడువు.. తరచూ మార్చితే ఎలా?

## నాలెడ్జ్ ఎకానమీకి
## విశాఖ ఫ్యూచర్ సిటీ : సీఎం చంద్రబాబు

: నాలెడ్జ్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీగా విశాఖపట్నం మారుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఉత్తమ నగరాలలో ఒకటిగా విశాఖ నిలుస్తుందన్నారు. టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, నాలెడ్జ్ ఎకానమీలో యువత కీలకంగా మారారని అన్నారు.

విశాఖపట్నంలో నేషనల్ డీప్ టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌కు శుక్రవారం హాజరయ్యారు. డీప్ టెక్నాలజీ సదస్సు-2024 లో స్వర్ణ ఆంధ్ర ట్రాన్స్ఫ‌ర్మేషన్ ఇండియా టూ వికసిత భారత్ , ఏఐ ఫర్ ఎవరీ వన్ అనే రెండు పుస్తకాలు ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

ఈ సదస్సును ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ%ా% ప్రపంచంలో ఎటు చూసినా టెక్నాలజీపైనే చర్చ జరుగుతోందన్నారు. దీని కారణంగా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. జీవితంలో అది కూడా ఓ భాగంగా మారిందన్నారు.

మూడో వంతు ఐటీ నిపుణులు మనోళ్లే

%దేశం, విదేశాల్లోని ఐటీ నిపుణుల్లో 30 శాతం తెలుగువారేనని గుర్తు చేశారు. ఐటీ గురించి ఎవరు మాట్లాడినా హైటెక్ సిటీ ప్రస్తావన వస్తుందన్నారు. అప్పట్లో ఐటీ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకున్నామన్నారు. ఇప్పుడు డీప్ టెక్నాలజీ సరికొత్త ఆవిష్కరణ కేంద్రమైందన్నారు. దీన్ని అందుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందన్నారు.

ఏపీని నాలెడ్జ్ హబ్‌గా మారుస్తామని మనసులోని%ా% ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ అభివృద్ధికి ఒక విజన్ ప్రకారం ముందుకు వెళ్లామన్నారు. విశాఖ నగరం భవిష్యత్ నాలెడ్జ్ హబ్ అన్నారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫ్రామింగి డెవెలప్‌మెంట్ నినాదంతో వెళ్తున్నామన్నారు.వెయ్యి కిలోమీటర్ల తీరం ఉందని.. సముద్ర రవాణా మీద బాగా దృష్టి పెట్టామన్నారు. పవర్ సెక్టార్‌లో రాష్ట్రం మంచి అభివృద్ధి సాధించిందన్నారు. త్వరలో గ్రీన్ హైడ్రోజిన్ కూడా ఏపీ నుంచి ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## పోలవరం గడువు..
## తరచూ మార్చితే ఎలా?

**పీపీఏ సీఈవో అభ్యంతరం**
**2026 మార్చికే ఈసీఆర్ఎఫ్ పూర్తి చేస్తామన్నారుగా!**
**ఇప్పుడేమో 2027 చివరికని అంటున్నారు**
**వచ్చే జనవరి 2న డయాఫ్రం వాల్ మొదలుపెట్టాల్సిందే**
**ప్రత్యేక ఖాతా నుంచే లావాదేవీలు చేయాలి**
**అడ్వాన్సులో 75% ఖర్చుపెడితేనే తదుపరి వాయిదా విడుదల**
**పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్ జైన్**


అమరావతి, డిసెంబరు 6

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే గడువును తరచూ మార్చేస్తే ఎలాగని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్ జైన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 2021 నుంచి వరుసగా తేదీలు మార్చుతూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టును 2026 మార్చినాటికి పూర్తి చేస్తామని రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చినందునే.. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి డెడ్‌లైన్‌ను అధికారికంగా ప్రకటించామని తెలిపారు. ఇప్పుడు కీలకమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం (ఈసీఆర్ఎఫ్)ను 2027 డిసెంబరుకు పూర్తి చేస్తామంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. పోలవరం పనులపై శుక్రవారం ఢిల్లీ నుంచి అతుల్ జైన్ రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను జనవరి 2వ తేదీన ప్రారంభించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ పనుల బాధ్యత పూర్తిగా జర్మన్ సంస్థ బావర్‌దేనని స్పష్టం చేశారు. గతంలో ఆ సంస్థ, ఎల్ అండ్ టీ కలసి వాల్‌ను నిర్మించాయని.. ఇప్పుడు బావర్ ఒక్కటే కడుతోందని చెప్పారు. కాంక్రీట్ ప్లాస్టిక్ మిక్స్‌ను మేఘా ఇంజనీరింగ్ సిద్ధం చేసినప్పటికీ.. మిశ్రమం సరిగా ఉందో లేదో ధ్రువీకరించి.. నిర్మాణం చేపట్టాల్సింది బావర్ మాత్రమేనని వెల్లడించారు.

కేంద్రం నుంచి పోలవరం నిధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాంకు ఖాతా ద్వారానే పనుల చెల్లింపులన్నీ జరగాలని అతుల్ జైన్ స్పష్టం చేశారు. ఈ షరతుపైనే రాష్ట్రానికి రూ.2,300 కోట్లు ముందస్తుగా ఇచ్చామన్నారు. ఈ నిబంధనపై ఎలాంటి సడలింపులూ ఉండవని చెప్పారు. ఈ ఖాతాలో ఇప్పటిదాకా రూ.300 కోట్లే జమ చేశారని.. మిగిలిన రూ.2,000 కోట్లు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అడ్వాన్సుగా ఇచ్చిన రూ.2,300 కోట్లలో 75శాతం వ్యయం చేస్తేనే.. తదుపరి వాయిదా విడుదలవుతుందని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.5,000 కోట్లు ముందస్తుగా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. కాంట్రాక్టు సంస్థ, జల వనరుల శాఖతో పాటు థర్డ్ పార్టీగా మరో ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అతుల్ పేర్కొన్నారు. ఇందుకోసం టెండర్లు పిలవాలన్నారు. పోలవరం డిజైన్లన్నీ ఆఫ్రీ ఏజెన్సీ ద్వారా మేఘా చేపడుతోందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంపై ప్రతి 15 రోజులకోసారి కాంట్రాక్టు సంస్థలతో సమావేశం నిర్వహించాలన్నారు. నిర్మాణ సంస్థపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) స్థాయి అధికారికి నియంత్రణ ఉండాల్సిందేనని పీపీఏ సీఈవో స్పష్టం చేశారు.

## ఎపికి పవన్ నాయకత్వం..
## ట్వీట్ చేసిన వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి

**యువ ఎపికి 75 ఏళ్ల వృద్దుడు నేతృత్వమా**
**చంద్రబాబు వద్దే వద్దు..**
**పవన్ పాపులారిటీ ఉన్ననేత**
**ఎన్డీఏ కూటమి నేతలకు ఆయనే ఆదర్శం**



అమరావతి : నేషనల్ పాప్యులారిటీ, వయస్సు రీత్యా రాష్ట్రాన్ని నాయకత్వం వహించే సామర్థ్యం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఉందని వైసీపీ సీనియర్ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీలోని ఎన్‌డీఏ పార్టీల నాయకుల్లో అత్యంత ఆదర్శవంతమైన వ్యక్తి జనసేన అధినేత పవన్ అని ఆయన ప్రశంసించారు.. ఈ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. యువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు 75 ఏళ్ల వృద్ధుడైన చంద్రబాబు నాయకత్వం వహించలేరని దెప్పి పొడిచారు

## రైతన్నలకు శుభవార్త :
## ఎటువంటి హామీ లేకుండానే రెండు లక్షలు రుణం

న్యూ ఢిల్లీ : రైతులకు ఆర్ బి ఐ శుభవార్త చెప్పింది..ఇకపై రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించింది రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా. చిన్న, సన్నకారు రైతులకు పెద్ద ఉపశమనం ఇచ్చేలా భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం కీలక ప్రకటన చేసింది. చిన్న, సన్నకారు రైతులకు ఎలాంటి పూచీకత్తు లేకుండానే ఇచ్చేలా రుణాల పరిమితిని రూ. 1.60 లక్షల నుంచి రూ. 2 లక్షలకు పెంచింది భారతీయ రిజర్వ్ బ్యాంక్.

ప్రస్తుత సమయంలో.. ఖర్చులు, ద్రవయోల్బణం, పెట్టుబడి ఇలా అనేక రకాల అంశాలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో చిన్న అలాగే సన్న కారు రైతులకు ఊరట కలిగించేందుకు రెండు లక్షల వరకు రుణాలు పెంచుతున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటన చేసింది. 2019 సంవత్సరంలో రుణ పరిమితిని లక్ష రూపాయల నుంచి 1.6 లక్షల వరకు పెంచింది. అయిదేళ్ల తర్వాత రుణాన్ని రెండు లక్షలకు హెచ్చించింది..

## టీడీపీ శాశ్వత సభ్యత్వం

నారా లోకేష్ చేతుల మీదుగా సభ్యత్వాన్ని పొందుతున్న వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఐటీ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు.

విజయవాడలో శుక్రవారం ఆయన నారా లోకేషను కలిసి ఆనలైన ద్వారా రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. అనంతరం సీఎం చంద్రబాబును, మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసి గనులకు సంబంధించిన సమస్యలను విన్నవించారు.

## ఆర్ఎంపీల వైద్యాన్ని అరికడతాం: డీఎంహెచఓ



బాధితుడితో వివరాలు సేకరిస్తున్న డీఎం హెచఓ ఈబీ దేవి

పామిడి, డిసెంబరు 6 :

ఆర్ఎంపీల వైద్యం అరికడతామని డీఎంహెచఓ ఈబీ దేవి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు శివ అనే యువకుడికి చేసిన వైద్యం వికటించి కాలు సెప్టిక్ అయింది. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా శుక్రవారం ఆమె విచారించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆసుపత్రిలో లైసెన్స ఉన్న వైద్యుడు కాకుండా ఆర్ఎంపీ వైద్యుడు చికిత్స చేయడంతోనే శివ అనే యువకుడి కాలు సెప్టిక్ అయ్యిందన్నారు. దానిని నయం చేసుకునేందుకు రూ.లక్షలు వెచ్చించాల్సి వచ్చిందని బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. అందులో భాగంగా ఆ ఆసుపత్రి వైద్య సేవలపై ఆరా తీస్తూ విచారణ చేపట్టామన్నారు. ప్రస్తుతం ముగ్గురు వైద్య నిపుణులతో కలెక్టర్ ఓ కమిటీ వేశారన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలకు సంబంధించి కేసు షీటు, కెమెరా విజివల్స్ అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో ఆర్ఎంపీ వైద్యుల నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిసిందన్నారు. అలాంటి ఆర్ఎంపీలపై చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడతామని తెలిపారు. డీఎంహెచఓ వచ్చిన విషయం తెలుసుకుని ఆర్ఎంపీ వైద్యులు తమ ప్రథమ చికిత్సా కేంద్రాలు మూసివేయడం గమనార్హం.

# తిరుచానూరు పద్మావతి అమ్మవారి పంచమీ తీర్థ వైభవం





తిరుచానూరు , (రాయలసీమ) :

తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఈ రోజు లక్షలాది మంది భక్తుల గోవిందనామ స్మరణల నడుమ పంచమీ తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరాలయం నుంచి సంప్రదాయ సిద్ధంగా పసుపు కుంకుమల అప్పాపడి ఊరేగింపు మొదలైంది. స్వామి వారి తరపున అమ్మవారికి సమర్పించడానికి సిద్ధం చేసిన రూ ఒక కోటి 11 లక్షల విలువైన పాండ్యరాజ కిరీటం, వజ్రాల హారం, లక్ష్మీపతకం , వజ్రాల గాజులు, వజ్రాల కమ్ములు ఆభరణాలను అప్పాపడి తో కలిపి తిరుమల తిరుపతి దేవస్థానాల (టి టి డి)ఉన్నతాధికారులు ఒకరి నుంచి మరొకరికి అందచేసుకుంటూ ముందుకు తీసుకువచ్చారు.

అర్చకులు ఊరేగింపుగా తిరుపతిలోని అలిపిరి, కోమలమ్మ సత్రం, రాములవారిగుడి, గోవిందరాజుల గుడి మీదుగా తిరుచానూరు కు తీసుకువచ్చారు. అలిపిరి నుంచి ఏనుగుపై ఊరేగుతూ వచ్చిన అప్పాపడి తిరుచానూరు శివారులోని పసుపు మండపం వద్ద అర్చకులు స్వాగతం పలికి పద్మావతి అమ్మవారి ఆలయం వద్దకు తీసుకు వెళ్లారు. ఆలయంలోని అమ్మవారి సముఖంలో అప్పాపడి కి పూజలు చేసిన అర్చకులు ఊరేగింపుగా ఆలయ పుష్కరిణి ఒడ్డున ఉన్న పంచమీ తీర్థ మండపం వద్దకు చేర్చారు. అంతకుముందే అక్కడకు చేర్చిన పద్మావతి అమ్మవారి ఉత్సవమూర్తికి, సుదర్శన చక్రానికి పాంచరాత్ర ఆగమోక్తంగా పంచ కలశ తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సుముహూర్తంలో అమ్మవారి తరపున సుదర్శన చక్రాన్ని అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పుష్కరణి జిల్లాల్లో మూడుసార్లు పవిత్ర స్నానం చేయించారు.

ఆ క్షణం కోసం వేచిఉన్న భక్తకోటి చక్రం తో పాటు పుష్కరిణీ జలాల్లో పుణ్యస్నానాలను ఆచరించారు.ఈ పంచమీ తీర్థ మహోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన మూడు లక్షల మందికి పైగా భక్తులు రోజంతా పుష్కరిణి జలాల్లో స్నానాలు చేసినట్టు అధికారులు ప్రకటించారు. అనంతరం టి టి డి భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులకు అన్న ప్రసాద వినియోగం ఏర్పాట్లు చేసింది. టి టి డి పోలీసు శాఖల సమన్వయంతో లక్షలాదిమంది భక్తులు ఈ ఏడాది పంచమీ తీర్థ మహోత్సవంలో సంతృప్తి కరంగా పాల్గొన్నారు.భారీ బందోబస్తు ఏర్పాట్ల మధ్య పంచమీ తీర్థం వైభవంగా ముగిసింది.

ఈ కార్యక్రమాలలో టి టి డి ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బి ఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్యామల రావు, అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి, సంయుక్త కార్యనిర్వహణాధికారి వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సుబ్బారాయుడు, ఇతర టి టి డి ఉన్నతాధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు పంచమీతీర్థ మహోత్సవం తో పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసాయి.



## డిసెంబర్ 12న నంద్యాలలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

**రిజిస్ట్రేషన్ కొరకు ఈ నెల 8వ తేదీ వరకు పొడిగింపు**

**. 12 విభాగాలలో పోటీలు**




నంద్యాల డిసెంబర్ 6( రిపబ్లిక్ న్యూస్): ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో డిసెంబర్ 12వ తేదీ నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఈనెల 8వ తేదీ లోపల ఆంధ్ర చెస్ అసోసియేషన్ వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు గడువు పెంచడం జరిగింది.

12 వివిధ వయసు కేటగిరీలలో పోటీలు నిర్వహించబడతాయి.

వయసు ధ్రువీకరణ పత్రాలు కూడా సమర్పించాలన్నారు. ఒక్కొక్క విభాగంలో పదవ స్థానం వరకు విజేతలుగా నిలిచిన వారికి మొత్తం 12 విభాగాల్లో 120 మందికి ట్రోఫీలను నంద్యాల లయన్స్ క్లబ్ యూత్ వింగ్ వారి సహకారంతో అందజేయడం జరుగుతుందని, క్రీడాకారులకు భోజన వసతిని ఎన్.ఆర్.జి చెస్ అకాడమీ గౌరవాధ్యక్షులు, బేతంచర్ల పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ రాజేష్ కల్పిస్తున్నారు. నంద్యాల ప్రాంత చదరంగం క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జి. రవికృష్ణ , జి .రామ సుబ్బారెడ్డిలు కోరారు.ఇతర వివరములకు నంబర్ 9010451585 సంప్రదించాలని కోరారు.

## అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి సర్పంచ్ వేల్పుల జైపాల్.



**ఘనంగా బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి.**

వెలుగోడు డిసెంబర్ 6 రిపబ్లిక్ న్యూస్ భారతదేశ రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని సర్పంచ్ వేల్పుల జయపాల్ పేర్కొన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత 16 డిగ్రీలు పూర్తిచేసిన మేధావి, భారత దేశ రాజ్యాంగాన్ని రచించడంలో ప్రధాన పాత్ర పోషించిన డాక్టర్ భీమ్ రావు రామ్ జీ అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలు వెలుగోడు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం లో,అంబేద్కర్ చిత్రపటానికి. అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ జైపాల్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు . బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు , టిడిపి పట్టణ అధ్యక్షుడు ఖలీల్, ఎస్సీ నాయకుడు రాయప్ప, గ్రామపంచాయతీ సిబ్బంది , అన్ని కులాల సంఘాల పార్టీల నాయకులు పూలను సమర్పించి నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశంలోని ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించడానికి , దేశ ప్రజలందరి హక్కులను కాపాడటానికి రాజ్యాంగంలో చట్టాలను రచించి అవి అమలు అయ్యేలా చేసిన ఘనత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాజిద్ అలీ.ఇర్ఫాన్ , సచివాలయం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుడి మరణానికి ఉన్మాదులను శిక్షించాలి... ఫ్యాప్టో




వెలుగోడు డిసెంబర్ 6 రిపబ్లిక్ న్యూస్. ఉపాధ్యాయుడిపై దాడి చేసి చంపిన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనివేళ తర్వాత ఉపాధ్యాయులు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్ పక్క తరగతిలో అల్లరి చేస్తున్న కొందరు విద్యార్థులను అల్లరి చేయవద్దని వారించినందుకుగాను, ఉపాధ్యాయుని పై తిరగబడటంతో పాటు రెచ్చిపోయి ఉన్మాదులుగా తయారై తరగతి గదిలోనే ఉపాధ్యాయునిపై దాడి చేస్తూ పిడుగుద్దులు గుద్ది, విచక్షణా రహితంగా కొట్టి ఉపాధ్యా యుని మరణానికి కారణమయ్యారని వారు ఆరోపించారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఉపాధ్యాయుడి పైనే సాక్షాత్తు తరగతి గదిలోనే ఉన్మాదులైన కొందరు విద్యార్థులు రెచ్చిపోయి దాడిచేసి చంపేశారంటే సమాజంలో విలువలు ఏమేరకు పతనమయ్యాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆన్లైన్ గేమ్స్, యూట్యూబ్, గంజాయి లాంటి వ్యసనాలకు బానిసలుగా తయారై విచక్షణ కోల్పోయి ఇలాంటి దాడులకు తెగబ డుతున్నారని ఆరోపించారు.పతనమవుతున్న నైతిక విలువలు,మారుతున్న సమాజ స్థితిగతుల నేపథ్యంలో ఉపాధ్యాయుడు తరగతి గదిలో నిర్భయంగా విద్యాబోధన చేయాలంటేనే భయ పడాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు.మారుతున్న సమాజంలో తప్పు చేసిన విద్యార్థులను తల్లిదండ్రులు సైతం మం దలించకపోవడం, తప్పు చేసిన వారిని వెనకేసుకరావడం లాంటి ఘటనల వల్లే ఇలాంటి విపరీత పోకడలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటిసం" ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే ఉపాధ్యాయుల రక్షణకు పటిష్టమైన చట్టాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఉపాధ్యాయుడి మరణానికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లి దండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలని, సరైన మార్గంలో వారిని నడిపించేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్, సయ్యద్ మొయినుద్దీన్, ఎం ఎం డి ఫైజుల్లా,ఎహసానుల్లా ఖాన్, ఎస్.అహ్మద్ హుస్సేన్, రామకృష్ణ, వెంకటసుబ్బయ్య, ఎం. జి ఎల్ నరసింహులు, అన్నపూర్ణమ్మ, సునీత, హైమావతి, వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# అంబెడ్కర్ ఆశయలే శరణ్యం





**-పాణ్యం, డిసెంబర్,6,(రిపబ్లిక్ న్యూస్) పాణ్యం.**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్68 వర్ధంతి సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఉన్న అంబేద్కర్ గారి విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రంగ రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు, దానం, ప్రజాసంఘాల నాయకులు దేవ దత్తు, యంర్పీఎస్ రాష్ట్ర నాయకులు గుద్దల సమేల్, మాట్లాడుతూ ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఈ దేశంలో అంటరానితనం ఎంతగానో వేలునుకుని పోయిందని దీనిని ఎలాగైనా మార్చాలని ఆయన నిరంతరం పరితపించేవాడు, మరియు బహుజనుల కోసం దళిత ఆదివాసీల కోసం ప్రత్యేకంగా రిజర్వేషన్లు కావాలని భారత పార్లమెంటులో అనేక పర్యాయాలు వాటి గురించి మాట్లాడటం జరిగింది. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత మన దేశానికి ప్రత్యేక రాజ్యాంగం కావాలని దానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయించి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని కమిటీ చైర్మన్ గా మెజారిటీగా ఎన్నుకొని ఆయనను రాజ్యాంగం రాయవలసిందిగా కోరడమైనది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశంలో ఉన్న ప్రతి పౌరునికి కార్మికులకి మహిళలకు హక్కులు సంక్రమించే విధంగా రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మేధావి అని వారు కొనియాడారు

ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు మద్దయ్య మహేష్,పెరుగు శివ కృష్ణ యాదవ్, ఆటో కార్మిక రంగనాయకులు నెరవాటి నాగరాజు కానుగల రాజేష్ మహేష్ రఫీ ఎస్టి నాయకులు



సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 62వ హెూంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు





**నైపుణ్యతను పెంచుకోని పోలీసులకు దీటుగా విధి నిర్వహణ చేస్తున్నారు మీ సేవలు అభినందనీయం**

**ఆత్మకూరు ముష్టపల్లి ఘటనలో వృద్ధురాలిని కాపాడిన హెూంగార్డుకు సన్మానం**

**హెూంగార్డ్స్ సంక్షేమానికి అన్నివేళలా అండగా ఉంటూ నా వంతు కృషి చేస్తా**

జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా




నంద్యాల క్రైం, డిసెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం నందు 62వ హెూంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పాల్గొని హెూంగార్డు నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "పోలీస్ శాఖలో ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా నిశ్వార్థంగా సేవ చేస్తున్న మీకు నా జోహార్లు" అని తెలియజేశారు. పోలీసు సిబ్బందితో పోలిస్తే హెూంగార్డులకు ఎన్ని సౌకర్యాలు తక్కువ ఉన్నా కూడా కొన్ని సందర్భాల్లో వారి కంటే ఎక్కువ సేవ చేస్తున్నారు. ఈ విషయంలో నంద్యాల జిల్లా పోలీస్ శాఖ తరపున హెూంగార్డులకు అభినందనలు తెలిపారు. హెూంగార్డ్స్ నంద్యాల జిల్లా 494 హెూంగార్డ్స్ మంది శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, క్రైమ్ నియంత్రణ, లా %౮% ఆర్డర్స్ డ్యూటీ, డ్రైవర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల యందు, దేవాలయాల యందు భద్రత కొరకు, టెక్నికల్ కెటగిరీల యందు పనిచేయుచున్నారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత ఉండడం వల్ల వారితో సమానంగా హెూంగార్డులు విధులను కూడా నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా కూడా ఎక్కడ కూడా రాజీ పడకుండా నిస్వార్థ సేవే మా దృఢ నిచ్చయం అనే విధంగా విధులు నిర్వహిస్తున్నందుకు మీకు నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. మీ సంక్షేమం కోసం పోస్టల్ యాక్సిడెంటల్ పాలసీని ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని తద్వారా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు 15 లక్షలు మీ కుటుంబానికి అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సంధర్భంగా ఏఆర్ అధిషనల్ ఎస్పీ చంద్రబాబు మాట్లాడుతూ 1962 చైనాతో యుద్ధం తర్వాత జనరల్ కరియప్ప సేవా దళాలుగా, ఇన్ఫార్మర్ వ్యవస్థగా ఉన్నటువంటి దళాలను కేంద్రీకృతం చేసి దేశమంతటా హెూంగార్డ్స్ అనే వ్యవస్థను ఎర్పాటు చేసి పోలీస్ డిపార్ట్మెంట్లో వారి యొక్క సేవలను వినియోగించుకోవాలనే ఉద్దేశంతో హెూంగార్డ్స్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీరు జిల్లాలో అన్నీ పోలీసు విభాగాలలో పనిచేస్తున్నారని ప్రజాసేవ ముందుండి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకొని రావాలని తెలియజేశారు. అలాగే ఈ సంవత్సర కాలంలో విధి నిర్వహణలో వివిధ కారణాల వలన మరణించిన హెూంగార్డ్స్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా వచ్చే అన్ని ప్రయోజనాలను అందించడంతో పాటు కారుణ్య నియామకాల ద్వారా వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగాన్ని ఇవ్వడం కూడా జరిగిందన్నారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముష్టపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడిన వృద్ధురాలిని కాపాడిన హెూంగార్డుకు శాలువాకప్పి జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించడం జరిగింది. విధి నిర్వహణలో గాయపడ్డ డోన్ హెూంగార్డుకు వైద్య ఖర్చుల నిమిత్తం జిల్లా పోలీస్ శాఖ తరపున రెండు లక్షల రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. అనంతరం ఈ సంవత్సర కాలంలో పలు విభాగాలలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన హెూంగార్డులకు ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ గారు అభినందించారు. పోలీస్ శాఖ చేపట్టిన అన్ని సంక్షేమ కార్యక్రమాలలో పోలీసులతో సమానంగా తమకు కల్పించి సమున్నత స్థానం



ఇస్తున్న జిల్లా ఎస్పీకి హెూంగార్డ్స్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన పెంపొందించుటకు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది తనకు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల టౌన్ డిఎస్పి శ్రీనివాస రెడ్డి, రిజర్వు ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# అనాధ పిల్లలకు అన్నదానం..
# ఘనంగా శాంతిరాం హాస్పిటల్ డైరెక్టర్ రఘురాం జన్మదిన వేడుకలు





**నంద్యాల డిసెంబర్ 6 ( రిపబ్లిక్ న్యూస్):**

అనాధ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్ జిపిఎస్ నాయకులు

శుక్రవారం నంద్యాల పట్టణంలో ఎస్ఆర్బిసి పర్యవర్తన లైఫ్ సెంటర్ నందు అనాధ పిల్లలకు, ఎయిడ్స్ బాధిత పిల్లలకు గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం అనాధ పిల్లలతో కలిసి శాంతిరాం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ రఘురాం జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ

ఎంతోమంది నిరుపేద ప్రజలకే కాకుండా గిరిజనులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ, దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులకు చికిత్స అందిస్తున్న హాస్పిటల్ శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో బెడ్లు దొరకని పరిస్థితుల్లో ఆపద్బాంధవుడిలా ఆదుకోవడమే కాకుండా ప్రాణాలను కాపాడిన గొప్ప వ్యక్తి డైరెక్టర్ రఘురాం గారు అని అన్నారు. తండాల్లో గ్రామాల్లో శాంతిరాం, మెడికల్ హాస్పిటల్ తరపున బస్సు సౌకర్యం కల్పించి నేరుగా రోగులకు హాస్పిటల్కు తీసుకొచ్చి మెరుగైన చికిత్స అందిస్తున్నారాన్నారు. నిరుపేద గిరిజనులకు 30 నుండి 50% రాయితీ కల్పిస్తూ ఆదుకుంటున్నారన్నారు. రఘురాం జన్మదినం సందర్భంగా జిపిఎస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వివిధ సేవా కార్యక్రమాలతో వృద్ధులకు వితంతువులకు, పేద పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య నేతలు, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్ బంజార ధర్మసేన రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు, అనాధ పిల్లలు, ఎయిడ్స్ బాదిత పిల్లలు పాల్గొన్నారు

## గర్భస్థ పిండ లింగ నిర్ధారణ
# వెల్లడి నిషేధంపై పకడ్బందీ చర్యలు తీసుకోండి

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల ప్రతినిధి, డిసెంబర్ 06, రిపబ్లిక్ న్యూస్ ::**

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధ చట్టం అమలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని పారామీటర్లలో నిర్దేశించిన లక్ష్యాన్ని చెరుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి అయితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా నిబంధనలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలన్నారు. హెపటైటిస్ బి, కిశోర బాలికల స్క్రీనింగ్, వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియ క్రమం తప్పకుండా రెగ్యులర్ గా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డి.ఎస్.పి, ఇతర అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలో మూడు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలు, రెండు రెన్యూవల్ స్కానింగ్ కేంద్రాలు, మూడు మాడిఫికేషన్ స్కానింగ్ కేంద్రాలు, మూడు ఏ ఆర్ టి క్లినికులతో పాటు ఏఆర్టి బ్యాంకు ప్రతిపాదనలను పరిశీలించి కలెక్టర్ మంజూరు చేశారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓ వెంకటరమణ, డిఎస్పి శ్రీనివాసులు, మదర్ సొసైటీ



ఎన్జీవో రామారావు, డిస్టిక్ ప్రోగ్రాం కన్సల్టెంట్ సుమలత, డెమో రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు

# భూ సమస్యలకు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు.

### -జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, డిసెంబరు 06 రిపబ్లిక్ న్యూస్ ::**

రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల గ్రామ సభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పాణ్యం శాసనసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 472 గ్రామాలు ఉన్నాయని అందులో 250 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే పనులు చేయాల్సి ఉందన్నారు.. రీ సర్వే జరిగిన, జరగని అన్ని గ్రామాల్లో కూడా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు.....గ్రామాల్లో చాలా వరకు భూ సమస్యలు ఉన్నాయని, మ్యుటేషన్ , వారసత్వంగా వచ్చే కుటుంబ సభ్యుల ఆస్తి భాగాల పరిష్కారం, సర్వే, పాస్ బుక్కులు రాకపోవడం, అలాగే సరిహద్దు తగాదాలు ఇలా చాలా రకాల సమస్యలు అర్జీల రూపంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో వస్తూ ఉంటాయన్నారు. గ్రామాల్లో ఉండే ప్రజలు చాలా దూరం నుండి సమస్యల పరిష్కారం కొరకు కలెక్టరేట్ కి రాకుండా....గ్రామాలలోకే ప్రభుత్వ యంత్రాంగం మొత్తం వచ్చి గ్రామ సభలను నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించడం జరుగుతోందన్నారు.. అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించే సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని.. మిగిలిన సమస్యలకు ఒక రసీదు ఇచ్చి తర్వాత చట్టపరంగా ఏ విధంగా అయితే చర్యలు తీసుకోవాలో ఆ విధంగా చర్యలు తీసుకొని పరిష్కార మార్గం చూపించాలన్నారు.. డిసెంబర్ 6వ తేది నుండి జనవరి 8వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా 33 రోజులు పాటు ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు..

ఎలాంటి భూ సమస్యలు ఉన్నా దరఖాస్తులు ఇచ్చి పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గ్రామ ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.. పాస్ బుక్ మ్యుటేషన్, సర్వే, లాంటి సమస్యలు ఏమున్నా యూజర్ ఛార్జ్ ఫీజు లేకుండా ఆన్లైన్ లో పేరు నమోదు చేసి పరిష్కారం చూపించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, దేవాదాయ, సచివాలయం, వక్ఫ్ కి సంబంధించిన అధికారులు అందరూ ఇక్కడే ఉన్నారని, మీకు సంబంధించిన సమస్యలు ఏవైనా పరిష్కారం కానివి



ఉంటే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారన్నారు.. ప్రొసీజర్ ప్రకారం చేయాల్సినవి ఏవైనా ఉంటే గ్రామ సభలు పూర్తైన 45 రోజుల్లో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారన్నారు..

పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పైసంతకం చేయడం జరిగిందన్నారు. .భూములు ఆక్రమణలకు గురికాకుండా ఉండడం కోసం ముఖ్యమంత్రి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ కూడా తీసుకు వచ్చార న్నారు. పాణ్యం నియోజకవర్గంలో ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో చాలా ఖరీదైన వక్ బోర్డు ఆస్తులు, దేవాదాయ ఆస్తులు అన్నీ కూడా ఆక్రమణలకు గురయ్యాయని, వాటిపైన దృష్టి సారించాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు ..స్థానికంగా ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువస్తూ, వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ . రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్ లో రిజిస్టర్ చేసి రసీదు కూడా ఇవ్వడం జరుగుతుందని, వచ్చిన ప్రతి విజ్ఞప్తిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా దరఖాస్తు ఏ దశలో ఉంది అని ఆన్లైన్ లో ట్రాక్ చేసుకోవచ్చు అని తెలిపారు. ముఖ్యంగా భూ సమస్యల్లో ఎక్కువ శాతం సరిహద్దు సమస్యలు, విస్తీర్ణంలో వ్యత్యాసం ఉన్నపుడు సర్వే నిర్వహించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు.

రెవెన్యూ సదస్సుల కార్యక్రమంలో భూసమ్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా భూవివాదాలను పరిష్కారం కోసం కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే వారమని కానీ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు అనే కార్యక్రమం ద్వారా గ్రామానికి వచ్చి ప్రజల నుంచి అర్జీలు తీసుకొని పరిష్కారం చేయడం జరుగుతోందన్నారు .

డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని పరిష్కారం పొందాలన్నారు. అదే విధంగా పెద్దపాడు గ్రామంలో గతంతో గ్రామ కంఠం క్రింద ఉండడం వల్ల 200 ఇళ్లకు ప్రాపర్టీ టాక్స్ అనేది రాలేదని, వాటిని త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పాణ్యం శాసనసభ్యులకు విజ్ఞప్తి చేశారు.

అనంతరం రాజ్యాంగ రూపకర్త డా.బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్, పాణ్యం శాసనసభ్యులు, జాయింట్ కలెక్టర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, , పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ దీప్తి, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ కు ఘన నివాళి




**బండి ఆత్మకూరు, డిసెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):-**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి బండి ఆత్మకూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ మన్నే జ్ఞానభరణం స్థానిక అంబేద్కర్ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయనతోపాటు విశ్రాంత సైనికుడు నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రత్యేక పాఠశాలలో విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తిదాయకమైన మాటలను స్మరించుకున్నారు. సమానత్వం ఒక కల్పితం కావచ్చు కానీ అయితే దానిని పాలక సూత్రంగా అంగీకరించాలని వారు అన్నారు. మరింత సమానమైన సమాజం కోసం ఆయన చూపిన చొరవ నేటికీ మనకు స్ఫూర్తిగా నిలుస్తుందని వారు కొనియాడారు. అనంతరం విద్యార్థులు అంబేద్కర్ చిత్రాలను చిత్రీకరించిన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంచిపెట్టారు. అలాగే వారితోపాటు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బండపల్లి సురేష్, మారెడ్డి రామయ్య, నల్లబోతుల మల్లికార్జున, గురునాథ్ ,రాయల్, మద్దిలేటి, సిపిఎం నాయకులు డేవిడ్ వేర్వేరుగా పాల్గొన్నారు.

## చిరస్మరనీయుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ : డాక్టర్ వినోద్



**నందికొట్కూరు, డిసెంబర్06, (రిపబ్లిక్ న్యూస్) :**

దేశ చరిత్రలోనే నిలిచిపోయిన మహనీయుడు, చిరస్మరనీయుడు డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ అని జయంత్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వినోద్ అన్నారు. నందికొట్కూరు లో బి ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు, అధికారులు ఘనంగా నిర్వహించారు. జయంత్ హాస్పిటల్ లో అధినేత వినోద్ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రమేష్ బాబు, ఎం ఆర్ పి ఎస్ సీనియర్ నాయకులు ప్రతాప్ మాదిగ, లింగాల స్వాములు మాదిగ, స్వామన్న, రవి, లోకరాజు, రైతు సంఘం నాయకులు రాజు, శేషన్న, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

## బదిలీపై వెళ్ళుచున్న పోలీస్ సిబ్బందికి ఘనంగా సన్మానం చేసిన పాములపాడు ఎస్సై- కే. సురేష్ బాబు



పాములపాడు డిసెంబర్ 6 (రిపబ్లిక్ న్యూస్):-ఇటీవల నంద్యాల జిల్లా ఎస్పీ- ఆదిరాజ్ సింగ్ రాణా గత 05 సంవత్సరముల నుండి, వివిధ పోలీస్ స్టేషన్ లలో పని చేయుచున్న పోలీస్ సిబ్బందికి బదిలీలు చేపట్టగా అందులో భాగముగా పాములపాడు పోలీస్ స్టేషన్ లో గత 05 సంవత్సరములుగా పని చేయుచున్న హెడ్ కానిస్టేబుల్- ఎర్రన్న ని సంజామల పోలీస్ స్టేషన్ కు మరియు కానిస్టేబుల్ శ్రీనివాసులు ని ఆత్మకూరు యుపిఎస్ కు బదిలీ చేయడం జరిగిందని ఎస్సై- కె.సురేష్ బాబు తెలిపారు.

ఈసంధర్భముగా పాములపాడు ఎస్ఐ- కే.సురేష్ బాబు బదిలీపై వెల్లుచున్న సిబ్బందిని శాలువాలు కప్పి, పూలమాలలు మెడలో వేసి, ఘనంగా సన్మానించడం జరిగింది. వారి సేవలను కొనియాడి భవిష్యత్తులో మరింత చురుకుగా పనిచేసి, పోలీస్ శాఖకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ సన్మానకార్యక్రములో పాములపాడు ఎస్సై- కే.సురేష్ బాబు గారితోపాటుగా ఏఎస్ఐ- యేసయ్య, హెడ్ కాన్సి టేబుల్స్ రమణ, అల్లా బకాష్ అదేవిధముగా పోలీస్ సిబ్బంది చెన్నయ్య, ఖాజా, యాగంటి, శివ ప్రసాద్, రసూల్ లు, తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మరమ్మత్తు పనులను పరిశీలించిన మంత్రి బీసీ



**కర్నూలు, డిసెంబర్ 6, రిపబ్లిక్ న్యూస్ ::**

కర్నూలు జిల్లాలోని స్థానిక నంద్యాల చెక్ పోస్ట్ లోని నేషనల్ హైవే రోడ్ల మరమ్మతు పనులను నేడు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతులు శాఖ మంత్రి బీ.సీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాట్ హోల్ ఫ్రీ రోడ్లే లక్ష్యంగా జరుగుతున్న మరమ్మతు పనులను తనిఖీ చేసేందుకు వరుసగా జిల్లాల్లో మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి పర్యటిస్తోన్నారు. ఇప్పటికే అన్నమయ్య, కడప, పల్నాడు జిల్లాల్లో పర్యటించిన మంత్రి.. తాజాగా నేడు రహదారుల మరమ్మతు పనుల పర్యవేక్షణలో భాగంగా కర్నూలు జిల్లాలో రోడ్ల మరమ్మతు పనులను మంత్రి పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా రోడ్డు మధ్యన ఉన్న ట్రాన్స్ ఫార్మర్ అంశంపై మంత్రి అధికారులను ఆరా తీశారు.. రోడ్డు మధ్యలో అలా ట్రాన్స్ ఫార్మర్ ను వదిలేస్తే ప్రమాదకరమని, కాబట్టి దానిని అక్కడి నుంచి మార్చాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, ఆర్ అండ్ బి శాఖ ఎస్ ఈ మహేశ్వర రెడ్డి మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, నేషనల్ హైవే ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో మళ్లీ చిరుత పులి కలకలం



మహానంది, డిసెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్)

మహానంది ఆలయ పరిసరాల్లో మరోసారి చిరుత పులి కనిపించడంతో స్థానికులు, భక్తులు భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం రాత్రి మహానంది నుంచి గాజులపల్లె వైపు వెళ్లే మార్గంలో టోల్గేట్ వద్ద చిరుత పులి కనిపించిన దృశ్యాలను స్థానికులు చిత్రీకరించారు. గురువారం రాత్రి 11:30 గంటల సమయంలోనూ చిరుత పులి మహానంది ఆలయం వెనుక ఉన్న కామేశ్వరి సత్రం వైపు వచ్చినట్లు స్థానికులు చెప్పారు. చూసిన అయ్యప్ప స్వాములు పరుగులు తీశారు.

## తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధి



- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం
- శ్రీశైలం ఈఓ ఎం. శ్రీనివాసరావు

మహానంది, డిసెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్)

తిరుమల తరహాలో శ్రీశైలం ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని శ్రీశైలం ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. నంద్యాలకు వచ్చిన ఆయన శుక్రవారం శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ శశిధర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు శ్రీశైలం ఈవోకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తానని చెప్పారు. పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

## దస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.. కలెక్టర్



**నంద్యాల బ్యూరో, డిసెంబర్ 6 :**
**జిల్లాలోని రైతులు తమ పొలాలకు సంబంధించిన పెండింగ్ లో ఉన్న సమస్యలను ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా సద్వినియోగం చేసుకొని పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ తెలిపారు. రెవెన్యూ సదస్సులు ప్రారంభోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లాలోని గడివేముల మండలం తిరుపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు.ంవెన్యూ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ వీఆర్వోలు, ప్రజలు పాల్గొన్నారు. గ్రామానికి సంబంధించిన పొలం సర్వేలో గత ప్రభుత్వం చేసిన తప్పులను కూడా ఈ కార్యక్రమంలో సరిదిద్దుకోవాలన్నారు. గ్రామానికి సంబంధించిన మ్యాప్ ను తీసుకొని పొలాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఆన్ లైన్ లో నమోదు చేసి పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు**

# సమాజంలో అన్ని రంగాల ప్రగతికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ దోహదప డుతుంది..







,భీమవరం:

సమాజంలో సొసైటీ ప్రగతి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా సాధ్యపడుతుందని అంతర్జాతీయ సదస్సుకు హాజరైన నిపుణులు పేర్కొన్నారు. భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఐ సి ఏ ఏ ఏ ఐ-2024) పేరిట జరిగిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జనరల్ చైర్స్ ,సి ఎస్ ఈ హెడ్ డాక్టర్ బి హెచ్ వి ఎస్ రామకృష్ణంరాజు, డీన్ అకాడమిక్ డాక్టర్ వి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఐటి రాయపూర్ సిఎస్సి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ సింగ్ మాట్లాడుతూ ఏ ఐ టెక్నాలజీతో అణు విద్యుత్ కేంద్రాలు కూడా నిర్మాణం జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడ పర్యటించిన భాషా సమస్య తలెత్తకుండా ఏ ఐ తో ఏభాషలోనైనా అనుసంధానం చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి మనిషి జీవన ప్రగతిలో ఏఐ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎన్ఐటి వరంగల్ సిఎస్సి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె వి కాదాంబరి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణ రాజు, కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వి రంగరాజు మాట్లాడుతూ ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు అంతర్జాతీయ నిపుణులతో నిర్వహించి కళాశాలకే మంచి ఖ్యాతి తీసుకొచ్చారని ప్రశంసించారు. అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ డాక్టర్ ఆర్ ఎన్ వి జగన్మోహన్, కో కన్వీనర్ సిఎస్సి అసిస్టెంట్ ప్రొఫెసర్ టీవీకెపి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్సి హెడ్ డాక్టర్ బి హెచ్ వి ఎస్ రామకృష్ణ రాజు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి చంద్రశేఖర్ మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులో మలేషియా యూఎస్ఏ, తో పాటు పలు దేశాల నుండి ప్రతినిధులు సదస్సులో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సదస్సులు అనేక అంశాలపై జరిగిన చర్చల్లో పరిశోధకులకు అధ్యాపకులకు విద్యార్థులకు ఎంతగానో భవిష్యత్తులో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సిఎస్సి డిపార్ట్మెంట్ కి చెందిన డాక్టర్ ఆర్ శివశంకర్ బృందం సైబర్ సెక్యూరిటీ ,ఐఓటి అండ్ బ్లాక్ చైన్ పై రూపొందించిన పరిశోధనాత్మక పత్రానికి బెస్ట్ పేపర్ అవార్డు అందించారు. ఈ బృందంలో డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ జి మహేష్, డాక్టర్ సిహెచ్ రవి స్వరూప్ ,కె వి ఎస్ ఆర్ మూర్తి ఉన్నారు. అదేవిధంగా ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సిఎస్సి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి ఎన్ ఎస్ బి కవిత కు డేటా సైన్స్ పై సమర్పించిన పరిశోధనా పత్రానికి బెస్ట్ పేపర్ అవార్డు కూడా లభించింది. డాక్టర్ కే సురేష్ బాబు ఏఐఎంఎల్ పై రూపొందించిన పరిశోధనా పత్రానికి బెస్ట్ పేపర్ అవార్డు లభించిందని చెప్పారు. బెస్ట్ పేపర్ అవార్డు గ్రహీతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు.

# దేశ రాజధాని ఢిల్లీ గల్లీకి చేరిన న్యాయం పూడి కీర్తి ప్రతిష్టలు






**అనకాపల్లి జిల్లాలో**
**సమృద్ధి నీటి సరఫరా విభాగంలో న్యాయంపూడి పంచాయతీకి కేంద్ర స్థాయిలో మొదటి స్థానంలో ఎంపికపంచాయత్ శతత్ వికాస్ పురస్కారానికి న్యాయం పూడి పంచాయతీ ఎంపిక కావడం పట్ల తబ్బి ఉబ్బి అవుతున్న పంచాయతీ వాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు**
**ఈనెల 11న ఢిల్లీ విజ్ఞాన భవన్ లో రాష్ట్రపతి చేతుల మీదుగా వికాస్ పురస్కార్ ను అందుకోనున్న పంచాయతీ పాలకవర్గం సహా అధికారులు**

నక్కపల్లి :

సమృద్ధి నీటి సరఫరా విభాగంలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయంపూడి పంచాయతీకి కేంద్ర స్థాయిలో మొదటి స్థానం లభించడంతో

దేశ రాజధాని ఢిల్లీ గల్లీకి న్యాయంపూడి కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప పడ్డాయి.సమృద్ధి నీటి సరఫరా విభాగంలో ఉత్తమ సేవలు అందించిన అనకాపల్లి జిల్లాలోని రెండు గ్రామాలలో న్యాయంపూడి పంచాయతీ ఎంపిక కావడంతో ఆ పంచాయతీకి కేంద్ర పంచాయతీ శతత్ వికాస్ పురస్కారానికి ఎంపికైనట్లు స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి శుక్రవారం ఉత్తర్వులు అందాయి.

దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ శతత్ వికాస్ పురస్కారానికిన్యాయం పూడి పంచాయతీ ఎంపిక కావడం పట్ల ఆ పంచాయతీ వాసులు, ప్రజా ప్రతినిధులు అధికారులు సహా మండల వాసులుతబ్బి ఉబ్బి అవుతున్నారు.

రాష్ట్ర స్థాయిలో నాలుగు విభాగాలలో మొదటి స్థానం సాధించిన మీదట కేంద్ర స్థాయిలో పోటీ పడి నిలవడంతో న్యాయం పూడి పంచాయతీకి

వికాస్ పురస్కార్అవార్డ్ ను కేంద్రం ప్రకటించినట్లు స్థానిక ఎంపీడీవో డి. సీతారామరాజు సహా ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు,సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు లు తెలిపారు. ఈ పురస్కారానికి ఎంపికైన న్యాయంపూడి పంచాయతీ ప్రతినిధులు సహా మండల పరిషత్ అధికారులకు11నెల 11న ఢిల్లీ విజ్ఞాన భవన్ లో రాష్ట్రపతి చేతుల మీదుగా వికాస్ పురస్కార్ ను అందజేస్తారని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఎవదు సంబంధించి మరింత లోతుకు వెళ్తేదీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ శతత్ వికాస్ పురస్కార్ కింద అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, న్యాయంపూడి గ్రామ పంచాయతీ

సమృద్ధి నీటి సరఫరా విభాగంలో కేంద్ర స్థాయిలో మొదటి స్థానం లభించిందన్నారు. దీంతో ఆ పంచాయతీ జాతీయ పుష్కరానికి ఎంపికైనట్లు తెలిపారు.రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం తో కేంద్ర స్థాయిలో పోటీ పడి న్యాయం పూడి పంచాయితీ మొదటి స్థానంలో నిలవడంతో ఈ అవార్డ్ లభించిందన్నారు.ఈ ఎంపికలో భాగంగా

ఈసారి ఆంధ్రప్రదేశ్ 4 విభాగాల్లో మొదటి స్థానం సాదించినట్లు తెలిపారు.అందులో అనకాపల్లి జిల్లా నుండి రెండు పంచాయతీలు మాత్రమే ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు.జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో

సీతారామరాజు పర్యవేక్షణలో న్యాయంపూడి గ్రామంలో ప్రతీ రోజు మంచి నీటి సరఫరా , శానిటేషన్,మంచినీటి నాణ్యత పరీక్షలు చేస్తూ ప్రజలకి త్రాగునీరు అందించడంతో ఆ పంచాయతీకి ప్రత్యేకత సంతరించుకున్నది. ఇందులో అధికారులు పంచాయతీ పాలకవర్గ సభ్యులు సచివాలయ కార్యదర్శి సిబ్బంది పాత్ర అమోఘమని చెప్పక తప్పదు. న్యాయం పూడి పంచాయతీ ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు, గోవింద రావు సహా పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ నెల 11 వ తేదీన ఢిల్లీలో గల విజ్ఞాన భవన్ లో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ఆ గ్రామపంచాయతీ ప్రథమ పౌరుడు సర్పంచ్ ఈ అవార్డ్ ను అందుకుంటారని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి సహా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వణ అధికారి,ఎంపీడీవో సీతారామరాజు,పంచాయతీ కార్యదర్శి నరసింహ రాజు హాజరుకానున్నారు.